హనుమా..వేడుకలు కనుమా..!

తిరుపతి కల్చరల్: ఆధ్యాత్మిక నగరంలో తిరుపతిలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలు వేడుకగా నిర్వహించారు. నగరంలోని శ్రీగోవింద రాజస్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఆజనేయ స్వామి ఆలయం, గాంధీరోడ్డులోని మఠం ఆంజనేయస్వామి ఆలయం, పాత హుజూర్ ఆఫీస్ వద్ద నున్న అభయ ఆంజనేయస్వామి ఆలయం, అలిపిరి పాదాల మండపం వద్దనున్న శ్రీభక్త ఆంజనేయస్వామి ఆలయం, శ్రీకపిలేశ్వరస్వామి ఆలయం పరిధిలోని శ్రీ అభయ హస్త ఆంజనేయ స్వామి ఆలయంలో గురువారం అభిషేకం, ప్రత్యేక పూజలు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే నాలుగు కాళ్ల మండపం వద్దనున్న ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్ ఆధ్వర్యంలో కళాకారులతో కలిసి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో సురేష్‌స్వామి, కేఎస్.రాజా, మునినాథరెడ్డి, నాగేశ్వరరావు, విజయభాస్కర్‌రెడ్డి, చెంగారెడ్డి, మురళి పాల్గొన్నారు. ఉపాధ్యాయనగర్‌లో సీతారామాంజనేయస్వామి ఆలయంలో ఆంజనేయస్వామి, సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఆలయ ధర్మకర్త లక్ష్మీప్రసన్న, శ్రీనివాసులురెడ్డి ప్రసాదాల వితరణ చేశారు. సాయంత్రం శ్రీసీతారాములను ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు మురళీస్వామి, కాలనీ వాసులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయ నగర్‌లో సీతారాములను ఊరేగింపు

శ్రీశక్తి పీఠంలో..

రాయల చెరువు కట్టపై ఉన్న శ్రీశక్తిపీఠంలో శ్రీ మళయాల హనుమంతునికి లక్ష తమలపాకులతో అర్చన, లక్ష అరటి పండ్లతో మహా నైవేద్యం సమర్పించారు. ప్రత్యేక పూజలు, హోమం చేశారు. భక్తులకు శక్తిపీఠం మాతాజీ పండ్లు, ప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే నగరంలోని అనాథ ఆశ్రమాలు, ప్రభుత్వ అసుపత్రుల వద్ద, నిరాశ్రయులకు పండ్లు పంపిణీ చేశారు.


శ్రీశక్తిపీఠంలోని అంజనేయస్వామికి లక్ష అరటి పండ్లతో సమర్పించిన నైవేద్యం


భక్తులకు అన్నప్రసాదం వితరణ


అభయ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద భక్తుల సందడి

సారె సమర్పించిన చెవిరెడ్డి దంపతులు

తిరుపతి రూరల్: మండలంలోని తుమ్మలగుంట, పేరూరు, చెర్లోపల్లెలో గురువారం ఉదయం హనుమంతుని విగ్రహాలకు పాలాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి వ్యవస్థాపకులు, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి దంపతులు సంప్రదాయం బద్ధంగా సారె తీసుకువెళ్లి శ్రీఆంజనేయస్వామి ఆలయ పండితులకు అందజేశారు. అలాగే చెర్లోపల్లెలో పూజల అనంతరం అన్నదానం నిర్వహించారు. పేరూరు వద్దనున్న ఆంజనేయ స్వామి ఆలయం పునరుద్ధరణ పనులు జరుగుతుండటంతో ఉత్సవ మూర్తికి అభిషేకం, పూజలు చేశారు.


సారె తీసుకు వెళుతున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి

రామ భక్త హనుమాన్‌కు జై..!


శ్రీవారిమెట్టు వద్ద ఊరేగింపు


తొండవాడ పంచముఖ ఆంజనేయస్వామికి చేస్తున్న క్షీరాభిషేకం

చంద్రగిరి: హనుమజ్జయంతి వేడుకలు మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. భక్తుల రామ నామ స్మరణలతో ఆలయాలు మార్మోగాయి. శ్రీవారి మెట్టు వద్ద పురాతన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో అభిషేక, ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. ఆ తర్వాత సుమారు 5వేల మంది భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.అనంతరం భజనలు చేశారు. సాయంత్రం సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామిని ఆలయం నుంచి శ్రీవారి పార్వేట మండపం వరకు ఊరేగించారు. అలాగే, తొండవాడ పంచాయతీలోని 50 అడుగుల శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఉదయం స్వామి వారికి మహాహోమం, సుమారు 3వేల లీటర్ల పాలతో క్షీరాభిషేకం నిర్వహించారు. శ్రీకృష్ణ దేవరాయల కోట గ్రామంలో శతాబ్దాల కాలం నాటి అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు, అభిషేకాలు, సింధూర సహస్ర నామార్చన, మహానైవేద్యం, శ్రీరామ హోమం, సాయంత్రం ఉయ్యాలసేవ నిర్వహించారు. ఇక, తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయ సమీపంలోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో స్వామి వారికి అభిషేక సేవల అనంతరం వడమాల, తమలపాకుల మాలతో శోభాయమానంగా అలంకరించారు.

భూమన లక్ష్మమ్మకు ఘన నివాళి

తిరుపతి మంగళం: చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన కరుణాకర రెడ్డి మాతృమూర్తి భూమన లక్ష్మమ్మ వర్ధంతి గురువారం నిర్వహించారు. తిరుపతి సుందరయ్యనగర్‌లోని శ్మశాన వాటికలో ఆమె సమాధిని పుష్పాలతో అలంకరించి భూమన కరుణాకరరెడ్డి దంపతులు, భూమన అభినయ్ రెడ్డి దంపతులతో పాటు కుటుంబ సభ్యులంతా కలిసి ఘన నివాళులర్పించారు.


భూమన లక్ష్మమ్మకు నివాళులర్పిస్తున్న భూమన కుటుంబ సభ్యులు

కో-ఆపరేటివ్ బ్యాంకులో లాకర్లు ప్రారంభం

తిరుపతి మంగళం: తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంకు(టౌన్‌బ్యాంక్) ముత్యాలరెడ్డిపల్లె శాఖలో ఖాతాదారుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కొత్త లాకర్లను గురువారం ఆ బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రా రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, తమ పాలకవర్గం ఖాతాదారులకు విశేషసేవలందించడంతో పాటు పాత బకాయిలు వసూలు చేయడంలో ఎంతో కృషి చేసిందన్నారు. టౌన్‌బ్యాంక్ చరిత్రలోనే తొలిసారి గత ప్రభుత్వ పాలనలో అప్పటి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి సహకారంతో రూ. 50కోట్ల టీటీడీ నిధులను తమ బ్యాంకులో డిపాజిట్ చేశారని గుర్తు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ డిపాజిట్‌ను రద్దు చేయించిందని, బ్యాంకు అభివృద్ధికి సహకరించడానికి బదులు కక్ష సాధింపులకు పాల్పడిందని విమర్శించారు. రాజకీయాలకు అతీతంగా టౌన్ బ్యాంకు అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంకు ఎండీ శివకుమార్, ఎంఆర్‌పల్లె బ్రాంచ్ మేనేజర్ వాణి, బ్యాంకు వైస్ చైర్మన్ వాసుయాదవ్, డైరెక్టర్లు పోలిరెడ్డి నాగిరెడ్డి, మహ్మద్ ఖాసీం బాషా, జ్యోతిప్రకాష్, కడపగుంట అమరనాథ్‌రెడ్డి, మబ్బు నాదమునిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, చంద్రయ్య, సురేష్‌కుమార్‌రెడ్డి, అనీల్‌రాయల్, వెంకటేష్ రాయల్ పాల్గొన్నారు.


ఎంఆర్‌పల్లె శాఖలో కొత్త లాకర్లను ప్రారంభిస్తున్న టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి

రూ.38 లక్షలతో కాలువ నిర్మాణం

–భూమిపూజ చేసిన ఎంపీపీ

తిరుపతి రూరల్: మండంలోని వేదాంతపురంలో గురువారం పంచాయతీ సర్పంచ్ చెరకుల జనార్ధన్ యాదవ్ ఆధ్వర్యంలో మురుగునీటి కాలువ నిర్మాణానికి ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి భూమి పూజ చేశారు. శిలాఫలకం ఆవిష్కరించారు. రూ. 38 లక్షల పంచాయతీ నిధులతో వినాయకనగర్ కాలనీ, వేదాంతపురం మీదుగా కాలువను నిర్మించ నున్నట్టు సర్పంచ్ చెప్పారు. చాలా కాలంగా మురు గు నీరు పాకుండా నివాసాల మధ్య నీటి నిల్వతో పడుతున్న ఇబ్బందులు ఈ కాలువ నిర్మాణంతో తొలగనున్నాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ క్రిష్ణవేణి పలువురు వైఎస్సార్ సీపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి, సర్పంచ్ జనార్ధన్ యాదవ్

పార్క్ అభివృద్ధికి ప్రణాళికలు

–కమిషనర్ మౌర్య ఆదేశం

తిరుపతి సిటీ: నగర పాలక సంస్థ పరిధిలోని భూపాల్ హౌసింగ్ కాలనీలోని పార్క్ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని కమిషనర్ ఎన్ మౌర్య అధికారులను ఆదేశించారు. గురువారం 50 వార్డులోని భూపాల్ హౌసింగ్ కాలనీ, ఇతర ప్రాంతాల్లో అభివృద్ధి, పారిశుద్ధ్యం పనులను ఆమె పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో సమస్యలను ప్రజలు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. కమిషనర్ పై విధంగా అధికారులను ఆదేశించారు. అలాగే సీసీ రోడ్లు వేసేందుకు పరిశీలించాలని, ప్రధాన రహదారి పక్కన వెళుతున్న మురుగు కాలువ నీరు రోడ్డుపైకి రాకుండా తీసుకోకుండా చర్యలు తీసుకోవడంతోపాటు పారిశుధ్యం మెరుగు పరచాలని ఆదేశించారు. కార్యక్రమంలోడిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాం సుందర్, మునిసిపల్ ఇంజనీర్ గోమతి, హెల్తాఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీఈ వెంకటప్రసాద్, సర్వేయర్ కోటేశ్వరరావు, శానిటరీ సూపర్‌వైజర్ సుమతి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమిషనర్

జీవ సంపదను పరిరక్షించుకుందాం


జీవ వైవిధ్య దినోత్సవంలో ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థినులు

తిరుపతి సిటీ: పద్మావతి డిగ్రీ/పీజీ కళాశాలలో గురువారం అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ టి నారాయణమ్మ మాట్లాడుతూ, వివిధ రకాల కాలుష్యం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతిని భూమి వేడెక్కి జీవ వైవిధ్యానికి ముప్పు వాటిల్లుతోందన్నారు. దీంతో అరుదైన జంతువులు, మొక్కలు అంతరించిపోతున్నాయని, వీటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మానవాళిపై ఉందన్నారు. ఎకో క్లబ్ కన్వీనర్, వృక్ష శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ బి.జ్యోతి మాట్లాడుతూ, మన దేశంలో 45 వేల రకాల వృక్ష జాతులు, 77 వేల జంతు జాతులు ఉన్నాయని, ప్రస్తుతం 10 శాతం పైగా ప్రమాదంలో ఉన్నాయంటూ దీనికి కారణాలను విశ్లేషించారు. భూతాపాన్ని తగ్గించే దిశగా అవసరమైన చర్యలు తీసుకుని జీవ సంపదను పరిరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జి.భద్రమణి, సూపరింటెండెంట్ శాంతి, త్యాగరాజులు, అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు

నివాళి

తిరుపతి రూరల్: మండలంలోని చెర్లోపల్లెకు చెందిన రంగయ్య (52) గురువారం హఠాన్మరణం చెందాడు. ఇది తెలుసుకున్న చంద్రగిరి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త, తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తన సోదరుడు హర్షిత్ రెడ్డితో కలసి రంగయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మృతుడి కుమారుడైన తన వ్యక్తిగత డ్రైవర్ హరీష్‌ను ఓదార్చారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అలాగే, తిరుపతి రూరల్ ఎంపీపీ మూలం చంద్ర మోహన్‌రెడ్డి, పేరూరు సర్పంచ్ దామినేటి కేశవులు, నారాయణరెడ్డి తదితరులు కూడా నివాళులు అర్పించారు.


రంగయ్య మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

దళిత విద్యార్థి హత్యాయత్న ఘటనపై విచారణ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు

–ప్రజా సంఘాల నేతలు డిమాండ్

తిరుపతి కల్చరల్: దళిత విద్యార్థి జేమ్స్‌పై కుల వివక్ష దాడికి పాల్పడడంతో పాటు హత్యాయత్నానికి తెగబడిన ఘటనపై సమగ్ర విచారణ చేసి బాధితుడికి న్యాయం చేయాలని ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, ఆర్‌పీఐ దక్షిణ భారత అధ్యక్షుడు పి.అంజయ్య మాట్లాడారు. శ్రీవిద్యానికేతన్‌లో బీటెక్ చదువుతున్న జేమ్స్‌పై రెండేళ్లుగా జూనియర్ విద్యార్థి యశ్వంత్ కులం పేరుతో దూషిస్తుంటే ఆత్మగౌరవంతో ప్రశ్నించిన జేమ్స్‌పై రౌడీషీటర్లతో నిర్బంధించి, చిత్రహింసలకు గురి చేయడం దుర్మార్గమన్నారు. ఈ సంఘటన ఎలైట్ పార్క్ హోటల్లో జరిగిందని, కుల అహంకారులకు, రౌడీషీటర్లకు అండగా నిలిచిన ఆ హోటల్ యాజమాన్యంతోపాటు బాధితుడి ఫిర్యాదు మేరకు ముద్దాలపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలన్నారు. కేసులో కొందరి పేర్లు తొలగిస్తే కేసు నమోదు చేస్తామని, కేసు వాపసు తీసుకో.. ఆసుపత్రి ఖర్చులు వారు చూసుకుంటారని చెప్పి, నామమాత్రం నమోదు చేసిన ఎస్ఐ అరుణపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జేమ్స్ బీటెక్ పూర్తి చేయడానికి రక్షణ కల్పించాలన్నారు. రౌడీషీటర్ రూపేష్, చోటా బ్లేడ్ అరాచకాలపై విచారణ చేసి వారిని తిరుపతి నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రజా సంఘాల నేతలు ఎం.ప్రసాద్‌రావు, అంబేద్కర్ భవన్ కమిటీ నేత పానకం ఇంద్రముని, బీఎస్పీ నేత వెంకటేష్, ఆమ్ ఆద్మీ నేత నగేష్, కేవీపీఎస్ నేత శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ నేత ఓమ్‌రాజ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేదకాలం నుంచే యోగాధ్యయనం

–వీసీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న వీసీ సీహెచ్ అప్పారావు

తిరుపతి సిటీ: మన దేశంలో వేదకాలం నుంచే యోగాధ్యయనం జరుగుతోందని ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు అన్నారు. ×యోగాంధ్ర–2025 ప్రచారంలో భాగంగా గురువారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఎస్వీయూ సెనేట్ హాల్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ, వేదాలు, ఉపనిషత్తులలో యోగా ప్రాచీన మూలాలు వున్నాయని, శారీరక, మానసిక, భావోద్వేగ శ్రేయస్సు కోసం యోగా ఉపకరిస్తుందన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో 192కు పైగా దేశాలు పాల్గొనడం శుభపరిణామమన్నారు. రిజిస్ట్రార్ భూపతినాయుడు మాట్లాడుతూ ×యోగాంధ్ర–2025 × లో వర్సిటీ చురుకైన పాత్రను పోషిస్తుందని, మెరుగైన ఆరోగ్యం, ఒత్తిడిని అధిగమించడానికి అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు రోజూ యోగా చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ టి.దామోదరం, అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ హరికృష్ణ యాదవ్, కల్చరల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.వివేక్, యోగా నిపుణురాలు డాక్టర్ నీరజ, యోగా శిక్షకులు ధనంజయ్, అమర్‌నాథ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

'మలబార్'లో వజ్ర, రత్న గాజుల ప్రదర్శన


గాజులను ప్రదర్శిస్తున్న కస్టమర్లు

తిరుపతి కల్చరల్: బాలాజీ కాలనీలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో బంగారు, వజ్రాలు, విలువైన రత్నాలతో పొదిగిన అద్భుతమైన గాజుల ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు షోరూం హెడ్ రిజీష్ తెలిపారు. ఈ ప్రదర్శనలో అధునాతన, ఆకర్షణీయమైన హంగులలో బంగారు, వజ్రాలు, రత్నాలు పొదిగిన గాజులు విక్రయిస్తున్నట్టు చెప్పారు. ఈనెల 26వ తేదీ వరకు నిర్వహించే ఈ ప్రదర్శనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహాభారత ఉత్సవాలు ప్రారంభం


మహా భారత ఉత్సవాలకు ఆహ్వానం పలుకుతూ ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు


చంద్రగిరి:మండలంలోని నరసింగాపురంలో ద్రౌపదీ సమేత శ్రీధర్మరాజుల వార్షిక మహాభారత ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం శ్రీకృష్ణ సమేత శ్రీద్రౌపదీ ధర్మరాజులకు ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించి మహాభారత వేదిక వద్దకు వేంచేపు చేశారు. తదుపరి అర్చకులు స్వామి, అమ్మవార్లకు కైంకర్యాలను నిర్వహించారు. మధ్యాహ్నం భాగవతారిణి గీతావాణి శ్రీకృష్ణ లీలలు హరికథాగానం చేశారు. ఆలయ నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయానికి విరాళం


విరాళం అందజేస్తున్న మాదాల శ్రీనివాస తేజ

తిరుపతి కల్చరల్: తిరుపతికి చెందిన యువ వ్యాపారవేత్త, మాదాల శ్రీనివాస్‌తేజ శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి రూ.1,00,116 విరాళాన్ని గురువారం ఆలయ ఈఓ ఏ.జయకుమార్‌కు అందజేశారు. ఆయన్ను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

పరశురామేశ్వరుడి సేవలో సీఐఎస్ఎఫ్ డీఐజీ


గుడిమల్లం ఆలయంలో డీఐజీ పొన్ని

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లంలో ఉన్న పరశురామేశ్వరాలయాన్ని గురువారం చెన్నై ఎయిర్‌పోర్ట్ సీఐఎస్ఎఫ్ డీఐజీ ఆర్.పొన్ని దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు మేళతాళాలతో స్వాగతం పలికి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ విశిష్టతను ఆమెకు వివరించారు. దర్శనానంతరం పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నోటీస్ బోర్డు

- 11 కేవీ బాలాజీ కాలనీ, 11కేవీ ప్రకాశం రోడ్డులోని ఫీడర్లలో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బాలాజీ కాలనీ, ప్రకాశం రోడ్డు, ఇందిరానగర్‌లో విద్యుత్‌కు సరఫరా ఉండదు.
- యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చేతి రాత, చెస్, స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ
- భవానినగర్‌లోని రోటరీ క్లబ్ కార్యాలయంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ఆక్యుపంక్చర్ చికిత్సా శిబిరం

హామీలు నెరవేర్చు బాబూ..!


మాట్లాడుతున్న రామమూర్తి

పాకాల: ఎన్నికల సమయంలో ఇచ్చిన నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొత్తకోట రామమూర్తి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎన్‌వీఎన్ పాఠశాలలో అసోసియేషన్ మండల అధ్యక్షుడు ఎం.ప్రభు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. రామమూర్తి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, ఇప్పటివరకూ రావలసిన డీఏ, పీఆర్సీ బకాయిలు విడుదల చేయలేదని విమర్శించారు. పీఆర్సీ అమలు లోపు మధ్యంత భృతి ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాన్ని వేయాలని, యాప్‌ల భారాన్ని తగ్గించి, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. రాబోవు పదోన్నతులలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు రోస్టర్ విధానాన్ని సక్రమంగా అమలు పరచాలని, స్టడీ లీవులలో ఉన్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల బదిలీలలో చూపించరాదని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, ప్రి.శ్రీరాములు, రమణ, టి.వెంకటస్వామి, ఎస్.రెడ్డెప్ప, వెంకటరత్నం, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ నగర నూతన కమిటీ ఎన్నిక


టి.సుబ్రమణ్యం, మాధవకృష్ణ

తిరుపతి కల్చరల్: సీఐటీయూ తిరుపతి నగర నూతన కమిటీని గురువారం సీఐటీయూ జిల్లా కోశాధికారి కేఎస్ఎస్.ప్రసాదరావు పర్యవేక్షణలో ఎన్నుకున్నారు. నగర అధ్యక్షుడిగా టి.సుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శిగా మాధవకృష్ణతో పాటు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు వేణుగోపాల్, బుజ్జి, చిన్న, మురళి, ఆనంద్, రఘు, వాసు, శేషయ్య, బాదుల్లా, రమేష్, శ్రీరాములు, అనుబంధ సంఘాల నేతలు పాల్గొన్నారు.